సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



సీనరేజ్ చెల్లిస్తేనే..

ఉచిత ఇసుక పక్కదారి పడుతోంది. వ్యాపారులు సీనరేజ్ చార్జీలు చెల్లిస్తేనే రవాణాకు అనుమతి ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు.

- 8లో ▸



ఆక్రమణల తొలగింపు

అనద్‌బాబానగర్‌లో ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేయడానికి ఏర్పాటు చేసిన ప్రీ కాస్ట్ గోడను అధికారులు తొలగించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /17.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

87,870 మందికి రైతు భరోసా

- ఎకరం లోపు రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసింది. జనవరి 26న మండలానికి ఒక గ్రామంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించిన ప్రభుత్వం బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా ఎకరం లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 87,870 మందికి రూ.42.52 కోట్లు ఖాతాల్లో పడినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఎకరానికి పైబడిన రైతులకు ప్రభుత్వం విడతల వారీగా రైతుభరోసా అందించనుంది.

ఎలక్ట్రిక్ ఆటో దగ్ధం



ఖలీల్‌వాడి: నగరంలోని ధర్మపురి హిల్స్‌లో ఓ ఎలక్ట్రిక్ ఆటో దగ్ధమైంది. కాలనీలోని మహ్మద్ మోహినొద్దీన్ తన ఆటోకు చార్జింగ్ పెట్టి ఇంట్లోకి వెళ్లివచ్చేసరికి మంటలు వ్యాపించాయి. ఆటో పూర్తిగా కాలిపోయింది. స్థానికులు కరెంట్‌ను నిలిపివేసి, మంటలను నీటితో ఆర్పివేశారు.

స్టేషన్ తండా రైల్వేగేటు మూసివేత

ఇందల్వాయి: ఇందల్వాయి, సిర్నాపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య గన్నారం, సిర్నాపల్లి రోడ్డు మార్గంలో.. స్టేషన్ తండా రైల్వేగేటు వద్ద ట్రాక్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు గేటు మూసివేయనున్నారు. ప్రజలు, ప్రయాణికులు సహకరించి రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిరాజ్ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలను గురువారం ముగ్గురు సభ్యులు గల న్యాక్ బృందం పరిశీలించింది. కళాశాల యాజమాన్యం గత నెలలో న్యాక్ గ్రేడ్ –ఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో న్యాక్ బృందం చైర్మన్ రాకేశ్ కుమార్ గుప్తా, సభ్యులు హరిచంద్ర రమణి, అనిరుద్‌భార్గవన్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, కంప్యూటర్ సైన్స్ విభాగం, కళాశాల చరిత్ర తెలిపే స్టాళ్లను ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా కళాశాల సాధించిన విజయాలను, నిర్వహించిన కార్యక్రమాలను ప్రదర్శించారు. న్యాక్ బృందం సభ్యులు కంప్యూటర్ విభాగం, లైబ్రరీ, ల్యాబ్‌లు, తరగతి గదులను విడివిడిగా పరిశీలన చేశారు. శుక్రవారం కూడా కళాశాలలో న్యాక్ బృందం పరిశీలన చేపట్టనుంది.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్సెస్సీ, బ్యాంకింగ్ ఉద్యోగ పరీక్షలకు, ఫౌండేషన్ కోర్సులకు ఉచిత కోచింగ్ కోసం ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 9నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 12నుంచి 14వరకు ఉంటుందన్నారు.70 శాతం అటెండెన్స్ ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8639002255ను సంప్రదించాలన్నారు.

ట్రైనీ ఇంజినీరింగ్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



నిజామాబాద్ సిటీ : ఢిల్లీకి చెందిన మిలిటరీ ట్రైనీ ఇంజినీరింగ్ సర్వీసెస్ విద్యార్థుల బృందం గురువారం నిజామాబాద్‌నగరంలో పర్యటించింది. 29 మంది గల ఈ బృంద సభ్యులు నగరంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణ, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డు, బయో వేస్టేజీ నుంచి ఎరువుల తయారీని పరిశీలించారు. బల్దియా కార్యాలయంలోని విభాగాలను అధికారులు ట్రైనీ విద్యార్థులకు వివరించారు.



స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పోకు వచ్చిన విద్యార్థులకు ప్రదర్శనలను వివరిస్తున్న ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు



ఎక్స్‌పో వద్ద ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు, ట్రస్మా ప్రతినిధులు

విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన 'ఇన్‌స్పైర్ ఇండియా'





- ఉమెన్స్ కళాశాలలో ఇస్రో, డీఆర్‌డీవో పరికరాలతో స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పో
- విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానాన్ని పంచిన కార్యక్రమం
- క్షిపణి పరీక్షలు, చంద్రయాన్ ప్రయోగాలపై ఆసక్తి చూపిన విద్యార్థులు
- వేల సంఖ్యలో హాజరు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దేశ రక్షణలో కీలకమైన ఆకాశ్, అస్త్ర, నాగ్ క్షిపణులు, స్పేస్ ప్రయోగాలు, ఉపగ్రహాల వ్యవస్థ, చంద్రయాన్ తదితర అంశాలపై ప్రతి ఒక్కరికీ ఆసక్తి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు పంచేందుకు ఉద్దేశించిన రెండురోజుల స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పో కార్యక్రమం గురువారం నిజామాబాద్ ఉమెన్స్ కళాశాలలో ప్రారంభమైంది. రక్షణశాఖ మంత్రి శాస్త్ర సాంకేతిక సలహాదారు డాక్టర్ జి సతీ ష్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న కలాంస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో ఇన్‌స్పై ర్ ఇండియా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్స్‌పోకు వచ్చిన విద్యార్థులకు ప్రదర్శనల గురించి ఇన్‌స్పైర్ ఇండియా సమన్వయకర్తలు, ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు వివరించారు.

అంతరిక్ష, రక్షణకు సంబంధించిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇస్రో, డీఆర్‌డీవో సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉమెన్స్ కళాశాలలో నిర్వహించడం సంతో

సద్వినియోగం చేసుకోవాలి

షకరమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సరళ మహేందర్‌రెడ్డి, ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు మహేందర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, అబ్బన్న, అపర్ణ, కిషన్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ భారతీరెడ్డి, శ్యాంకుమార్, ట్రస్మా ప్రతినిధులు నిత్యానందం, అరుణ్‌కుమార్, మామిడాల మోహన్, ధర్మరాజు, ఇన్‌స్పైర్ ఇండియా కోఆర్డినేటర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాల గురించి..

డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన భూమి నుంచి ఆకాశంలోకి ప్రయోగించే ఆకాశ్ క్షిపణి, క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్, ఆకాశం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే అస్త్ర క్షిపణి, శత్రువు యుద్ధ ట్యాంకర్లను ధ్వంసం చేసే నాగ్ క్షిపణి గురించి ఇన్‌స్పైర్ ఇండియా సమన్వయకర్తలు విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో చేస్తున్న ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరించారు.

ప్రదర్శనలు..

స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పోలో పదర్శనలు ఇలా ఉన్నాయి.. జియో సింక్రనైజ్డ్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ మార్క్3ని ప్రయోగించేందుకు ఉపయోగించే సీ25 క్రయోజనిక్ ఇంజిన్, 7 శాటిలైట్లను కలిగిన కచ్చితమైన నావిగేషన్ సిస్టమ్‌ను ప్రొవైడ్ చేసే ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్, సముద్రాలను స్టడీ చేసి వాతావరణం, గాలుల గురించి సమాచారం అందించే ఓషియన్ శాట్ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్), వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, తుపానుల గురించి సమాచారం తెలిపి హెచ్చరికలు జారీ చేసే ఇన్సాట్ 3 (ఇండియన్ నేషనల్ శాటిలైట్ సిస్టమ్), చంద్రుడి ఉపరితలం, అక్కడి గనులు, ఖనిజాలు, నీరు, మంచు గురించి అధ్యయనం చేసే చంద్రయాన్–1కు సంబంధించిన పీఎస్ఎల్‌వీ–సీ11, 1975 ఏప్రిల్ 19న ఇస్రో మొట్టమొదటగా ప్రయోగించిన ఆర్యభట్ట ఉపగ్రహం, చంద్రయాన్–2, చంద్రయాన్–3, గగన్‌యాన్‌కు సంబంధించిన ఎల్‌వీఎం 3 (జియోసింక్రనైజ్డ్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ మార్క్3, మార్స్ ఆర్బిటర్ మిషన్ (మంగళయాన్), జీశాట్–31, శాటిలైట్ లాంచ్ వెహికిల్–3, ఏఎస్ఎల్‌వీ గురించి విద్యార్థులకు వివరించారు.







స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పోలో ప్రదర్శనలతో ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు





ఎక్స్‌పోకు వచ్చిన విద్యార్థులకు ప్రదర్శనల వివరణ

గేట్లు ఎత్తాలంటే తిప్పలు తప్పవు!

- మొరాయిస్తున్న లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లు
- ఇబ్బందులు పడుతున్న లష్కర్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి జిల్లా రైతాంగానికి సాగు నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద గేట్లు ఎత్తాలన్నా.. దించాలన్నా తిప్పలు పడాల్సి వస్తోంది. దీంతో లష్కరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద గల రెండు గేట్లకు తలుపులు ఎత్తాలంటే మొదట మాన్యువల్ ఆపరేటింగ్ విధానం ఉండేది. 2017లో ఎలక్ట్రానిక్ విధానంతో గేట్లను అమర్చి మోటార్లను బిగించారు. అయితే విద్యుత్ సరఫరా లేక పోవడంతో ఏడాదిన్నరగా లష్కర్‌లే చేతులతో గేట్లను ఎత్తుతున్నారు. 20 రౌండ్లు హ్యాండిల్ తిప్పితే ఒక్క త్రెడ్ పైకి లేస్తుంది. ఇలా ఒక్కో గేటు కనీసం 200 త్రెడ్‌లు ఎత్తితే గాని నీరు ప్రవహించే అవకాశం లేదని లష్కర్‌లు చెబుతున్నారు. మహిళా ఉద్యోగులకు కూడా తిప్పలు పడాల్సి వస్తోంది. లక్ష్మి కాలువ ద్వారా ప్రస్తుతం 250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. దానిని కాస్తా పెంచడానికి గురువారం సిబ్బంది గేట్లను ఎత్తితే మొరాయించాయి. చివరికి అతి కష్టం మీద గేట్లను ఎత్తారు.

గతేడాది శివరాత్రి రోజున ముగ్గురు యువకులు లక్ష్మికాలువ హెడ్ రెగ్యులేటర్ సమీపంలోనే ప్రాజెక్ట్‌లో నీట మునిగి చనిపోయారు. ఆ సమయంలో కూడ గేట్లు మొరాయించాయి.

విద్యుత్ కేబుల్‌లో సమస్య..

లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు సమీపంలోనే లక్ష్మి ఎత్తిపోతల పథకం నిర్మించారు. విద్యుత్ సరఫరా కోసం పక్కనే ఆనకట్ట దిగువన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి లక్ష్మి హెడ్ రెగ్యులేటర్ వరకు కేబుల్ బిగించారు. అయితే కేబుల్‌లో సమస్య వల్ల విద్యుత్ సరఫరా కాక గేట్లు ఎత్తాలంటే మోటార్లు పనిచేయడం లేదని అధికారులు తెలిపారు. ఏడాదిన్నర కాలంగా ఈ సమస్య నెలకొంది. దీనిపై ఆయకట్టు రైతులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ సురేశ్‌ను సంప్రదించగా లిఫ్ట మెయింటెనెన్స్‌కు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో మోటార్లకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సమస్యను పరిష్కరిస్తామన్నారు.



లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తేందుకు ఇబ్బందిపడుతున్న మహిళాఉద్యోగులు

ఎఫ్‌ఆర్‌వో హత్య కేసులో ఒకరికి యావజ్జీవ ఖైదు

- 13 మందికి జీవితఖైదు నుంచి విముక్తి
- 23 మంది నిర్దోషులుగా విడుదల
- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు

ఖలీల్‌వాడి/ఇందల్వాయి (నిజామాబాద్ రూరల్): అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 2013 సెప్టెంబర్ 14న ఇందల్వాయి మండలం నల్లవెల్లి శివారులోని రిజర్వ్ ఫారెస్ట్‌లో జరిగిన ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి గంగయ్య హత్య కేసులో నల్లవెల్లి గ్రామానికి చెందిన ఒడ్డె భాస్కర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేస్తూ, 13 మందికి యావజ్జీవ ఖైదుని రద్దు చేస్తూ హైకోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. కేసు పూర్వపరాల్లోకి వెళితే నల్లవెల్లికి చెందిన భూమి లేని కొందరు పేదలు 309 సర్వే నంబరులోని అటవీ భూమిని చదును చేస్తుండగా అడ్డుకునేందుకు సిబ్బందితో కలిసి వెళ్లిన నాటి ఎఫ్‌ఆర్‌వో గంగయ్యను సదరు రైతులు వెంబడించి కళ్లల్లో కారం కొట్టి దారుణంగా నరికి చంపారు. ఈ కేసులో మొత్తం 37 మంది ముద్దాయిలలో 2017 సెప్టెంబర్ 25న నాటి జిల్లా కోర్టు 14 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. వీరందరూ శిక్షను అనుభవిస్తూ హైకోర్టులో అప్పీలు చేసుకోగా 23 మంది నిర్దోషులుగా, 13 మంది యావజ్జీవ ఖైదును రద్దు చేస్తూ, ఒడ్డె భాస్కర్‌ని ప్రధాన నిందితుడిగా పరిగణిస్తూ జీవిత ఖైదు విధిస్తూ హై కోర్టు తీర్పుని ఇచ్చింది.

హై కోర్టు తీర్పు పట్ల శిక్షను అనుభవిస్తున్న కుటుంబాలు హర్షం వ్యక్తం చేయగా, అటవీ శాఖలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నిజామాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టులో జరిగిన నేర న్యాయ విచారణనే ప్రామాణికంగా హైకోర్టు పరిగణిస్తూ తీర్పు వెలువరించడం జిల్లా న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చిందని, పలువురు సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు.

రూ. 12 కోట్ల నిషేధిత పదార్థాల దహనం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామ రెవిన్యూ శివారులోని శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో నిషేధిత మత్తు పదార్థాలను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ, డీపీఈవో మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎండు గంజాయి 1700 కిలోలు, అల్ప్రాజోలం 64.27 కిలోలు, డైజోఫాం 72 కిలోలు దహనం చేశారు. వీటి విలువ రూ.12 కోట్ల 22 వేల 500 ఉంటుందని మల్లారెడ్డి తెలిపారు.

పనిచేసే చోట మహిళలకు రక్షణ కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి సునీత, ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

- జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: మహిళలు పని చేసేచోట వారి రక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో గురువారం 'మహిళలకు పనిచేసే చోట జరుగుతున్న లైంగిక వేధింపులు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మహిళలను ఎవరైనా లైంగికంగా వేధిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా షీటీమ్, భరోసా కేంద్రాలలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు తాము పనిచేసే చోట కమిటీలు ఏర్పాటు చేసుకుని, సమస్యలపై చర్చించుకోవాలన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా మహిళలు న్యాయసలహాలు సూచనలు తెలుసుకోవాలన్నారు. సలహాలు, సూచనల కోసం ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ, అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకటరెడ్డి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుష్బూ ఉపాధ్యాయ, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

65 ఏళ్ల ఎస్సారెస్పీ కార్యాలయం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ, కార్యకలాపాల కోసం నిర్మించిన ఎస్సారెస్పీ కార్యాలయానికి నేటికి 65ఏళ్లు నిండాయి. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం 1963లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. కానీ అంతకంటే మూడు సంవత్సరాల ముందే ప్రాజెక్ట్ కార్యాలయం కోసం 1960లో ఫిబ్రవరి 7న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రి అల్లూరి సత్యనారాయణరాజు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్ట్ కార్యాలయం నుంచే ప్రాజెక్ట్ నిర్మాణ పనులను కూడ పర్యవేక్షించినట్లు అప్పటి అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ కార్యాలయం మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సాంగ్లీ ఏఎంసీ పరిశీలన



నిజామాబాద్ సిటీ: మహారాష్ట్రలోని సాంగ్లీ వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం నిజామాబాద్ మార్కెటింగ్ కమిటీ సభ్యులు పర్యటించారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పసుపు సాగును పరిశీలించారు. పసుపు కళ్లాలను చూసి పసుపు రైతులు, అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. వైస్ చైర్మన్ రామచందర్, పాలకవర్గం, డైరెక్టర్లు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జాతీయస్థాయి టోర్నీకి రఘురాం



రఘురాం

నిజామాబాద్‌నాగారం: డెహ్రాడూన్‌లో ఈ నెల 7 నుంచి 14వరకు నిర్వహించే 38వ జాతీయ క్రీడల నెట్‌బాల్ పోటీలకు అంక్సాపూర్‌కి చెందిన రఘురాం ఎంపికయ్యారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పురుషుల విభాగంలో రఘురాం ప్రతిభ చూపి ఎంపికయ్యారని రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ఖాజా ఖాన్ తెలిపారు. రఘురాం కామారెడ్డి జిల్లా హస్గుల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈసందర్భంగా రఘురాంను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, అంక్సాపూర్ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అభినందించారు.

బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక



శశిధర్

నిజామాబాద్‌నాగారం: కర్ణాటకలో ఈ నెల 7 నుంచి 10వరకు నిర్వహించే జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి జిల్లాకు చెందిన క్రీడాకారుడు శశిధర్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా శశిధర్‌కు బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు వీవీ రమణ, మానస గణేశ్, శ్యామ్, కిశోర్, కిషన్, రంజిత్ నర్సయ్య, రాజ్‌కుమార్, విద్యాసాగర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, రాజేశ్వర్, నర్సింగరావు, కృష్ణమూర్తి, నీరజ అభినందనలు తెలిపారు.

సీనరేజ్ చెల్లిస్తేనే అనుమతి

- ఉచిత ఇసుక పథకం పక్కదారి పట్టడంతో అధికారుల నిర్ణయం
- వాగులపై వ్యాపారులదే పైచేయి ఉండటంతో నిబంధనల సవరణ



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఇసుకను తరలించే వ్యాపారులు ఒక్కో ట్రిప్పుకు రూ.900ల చొప్పున సీనరేజ్ చార్జీలను చెల్లించాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇళ్లు నిర్మించుకునేవారికి ఉచితంగా ఇసుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఈ విధానం పక్కదారి పట్టడంతో కట్టడి కోసం అధికార యంత్రాంగం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. నిర్దేశించిన ఇసుక పాయింట్ల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటే సీనరేజ్ చార్జీలను డీడీల రూపంలో ప్రభుత్వ ఖజానాకు సొమ్మును జమ చేయాల్సి ఉంటుంది.

17చోట్ల ఇసుక పాయింట్లు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏప్రిల్‌లో ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకవచ్చింది. దీంతో ఇళ్లను నిర్మించుకునేవారు అధికారుల అనుమతి తీసుకుని సొంతంగా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకొని, ఇసుకను తీసుకోవాల్సి ఉంటుంది. వారికి గతంలో మాదిరిగా సీనరేజ్ చార్జీలను చెల్లించడం మినహాయించారు. జిల్లాలోని పెద్దవాగు, కప్పలవాగు, పూలాంగ్ వాగు, పసుపు వాగులపై 17 చోట్ల ఇసుక పాయింట్లను గుర్తించారు. ఈ పాయింట్ల నుంచి ఇసుకను జిల్లాలో ఎక్కడైనా ఇంటిని నిర్మించుకునేవారు ఉచితంగానే తరలించుకోవచ్చు. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిన తరువాత వ్యాపారులే ఇంటిని నిర్మించుకునేవారి పేరిట అనుమతులు పొంది తమ వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక్కో ట్రాక్టర్ లోడ్‌ను రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారని తేలింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా వ్యాపారులకు కలిసి రావడం, ఇసుకను కొనుగోలు చేసేవారికి ధర తగ్గకపోవడంతో ఉచిత ఇసుక విషయంలో నిబంధనలను అధికారులు సవరించారు. ఇంటిని నిర్మించుకునేవారు సొంతంగా తరలించుకుంటే ఉచిత అనుమతులు ఇవ్వనున్నారు. వ్యాపారులు అనుమతులు తీసుకుంటే మాత్రం సీనరేజ్ చెల్లించాలని నిర్ణయించారు. దీంతో అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

> **డీడీలు చెల్లిస్తేనే అనుమతులు**
>
> ఇసుక తరలించడానికి వ్యాపారులు గతంలో మాదిరిగా డీడీలు చెల్లించాల్సి ఉంది. ఉచితంగా అనుమతులు ఇచ్చినా ఇంటిని నిర్మించుకునే వారికి తక్కువ ధరకు ఇసుక లభించకపోవడంతో ఉన్నతాధికారులు మార్పులు చేశారు. ఇసుక పాయింట్‌ను నిర్వహించాలంటే సీనరేజ్ జమ చేస్తేనే అనుమతులు ఇస్తాం.
>
> – సీహెచ్ కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

నలుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు



వినాయక్‌నగర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో అశోక్

నిజామాబాద్‌అర్బన్: పాఠశాలలో సమయానికి అందుబాటులో లేని నలుగురు ఉపాధ్యాయులకు గురువారం డీఈవో అశోక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నగరంలో పలు ప్రభుత్వ పాఠశాలలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినాయకనగర్ ప్రాథమిక పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నలుగురు టీచర్లు(పద్మావతి, బొడ్డు భారతి, విజయశాంతి, కరుణశ్రీ) లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆటోనగర్‌లోని హై స్కూల్, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

మిర్చి కాంపౌండు ఉర్దూ పాఠశాల టీచర్‌కు..

నిజామాబాద్‌అర్బన్: నగరంలో మిర్చి కాంపౌండు ఉర్దూ మీడియం పాఠశాల టీచర్‌కు డీఈవో అశోక్ గురువారం నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ వ్యక్తుల బోధన అనే కథనం సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా విద్యాధికారి అశోక్ స్పందించారు. పాఠశాలలో సదరు టీచర్ తన స్థానంలో మరొకరితో విద్యాబోధన చేపడుతున్నట్లు తెలుసుకొని నోటీసులు జారీ చేశారు. అలాగే నగరంలోని పలు పాఠశాలలను సైతం తనిఖీ చేశారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం



కందూరి వెంకటేశ్వర్లు , పి.పద్మ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇద్దరు పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. డా.వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో పి.పద్మ 'ప్రిపరేషన్ డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ మైక్రో నానో స్ట్రక్చర్ ఇనార్గానిక్ మెటీరియల్స్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్స్ అండ్ దేర్ అప్లికేషన్ ఇన్ కాటలిసిస్'అనే అంశంపై పరిశోధన చేశారు. అలాగే కందూరి వెంకటేశ్వర్లు 'స్టడీస్ ఆన్ మీథైన్ డీకంపోజిషన్ ఓవర్ నికెల్ బేస్డ్ హైటిరోజీనెస్ కాటలిస్ట్స్ ఫర్ మాలిక్యులర్ హైడ్రోజన్ అనే అంశంపై పరిశోధన చేశారు. గురువారం ఏర్పాటు చేసి వైవాలో ఇద్దరు సిద్ధాంత గ్రంథాల్ని సమర్పించి పరిశోధన అంశాల్ని వివరించారు. అనంతరం ఆయా విభాగాధిపతులు వారికి డాక్టరేట్లను ప్రదానం చేశారు.

జడ్జి పోస్టులను భర్తీ చేయాలి



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను భర్తీ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియమితులైన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్ తుకారాంజీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కోర్టు పక్కన ఉన్న ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని జిల్లా కోర్టు అవసరాలకు కేటాయించే విధంగా చొరవ చూపాలని కోరారు. జిల్లా కోర్టులోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం హైకోర్టు జడ్జిని సన్మానించారు. హైకోర్టు ప్రాంగణంలోని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, అదనపు గవర్నమెంట్ ప్లీడర్ మహేశ్ రాజ్‌లను సైతం మర్యాద పూర్వకంగా కలిసినట్లు వారు పేర్కొన్నారు.

నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిపార్టమెంటల్ ఆఫ్ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ ధరావత్ నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు వీసీ యాదగిరిరావు గురువారం నియామకపు ఉత్తర్వులను ఆయనకు అందించారు. నాగరాజు మాట్లాడుతూ.. నామీద నమ్మకంతో నియామక ఉత్తర్వులు అందించిన వీసీ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

బయోటెక్నాలజీ విభాగంలో..



మహేందర్

డిచ్‌పల్లి: తెయూ బయోటెక్నాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఐదేని మహేందర్ నియమితులయ్యారు. ఈమేరకు వీసీ యాదగిరిరావు ఆయనకు నియామక ఉత్తర్వులను గురువారం అందజేశారు. ప్రస్తుతం తెయూ చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మహేందర్ గతంలో సారంగాపూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అడిషనల్ కంట్రోల్‌ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, యూ జీసీ కోఆర్డినేటర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీ సర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించిన వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న లారీ

- ఇద్దరు ప్రాణస్నేహితుల మృతి
- మాక్లూర్‌లో విషాదం



ఇంతియాజ్ (ఫైల్)



షేక్ ఫరాన్ (ఫైల్)

నిజామాబాద్ రూరల్/మాక్లూర్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ శివారులో ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు ప్రాణస్నేహితులు మృతి చెందారు. మృతులిద్దరూ మాక్లూర్ మండలకేంద్రానికి చెందినవారు కాగా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. రూరల్ సీఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా.. మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ ఫరాన్(25), ఇంతియాజ్(25) ఇద్దరు ప్రాణ స్నేహితులు. ఒకరు వెల్డింగ్ పని, మరొకరు ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవారు. గురువారం వారు ఆటోలో మాక్లూర్ నుంచి రూరల్ మండలంలోని గుండారం గ్రామానికి ప్యాసింజర్‌లను దింపడానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా శ్రీనగర్ శివారులో వారి ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, లారీని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వివరించారు. ఫరాన్‌కు వివాహం జరిగి, మూడు నెలల పాప ఉన్నట్లు సమచారం. అందరితో కలుపుగోలుగా ఉండే స్నేహితులు మృతిచెందడంతో గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

తల్లీకుమారుడి అదృశ్యం

కోటగిరి(రుద్రూర్): కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన జ్యోతి (24), తన కుమారుడితో సహ అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. జ్యోతి తన ఏడాదిన్నర కుమారుడిని తీసుకుని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కలా ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళకు మాటలు రావని, వీరి ఆచూకీ లభిస్తే కోటగిరి ఎస్సై 87126 59878, రుద్రూర్ సీఐ 87126 59875కు సమాచారం అందించాలని కోరారు.

పేకాడుతున్న పలువురి అరెస్టు

ఖలీల్‌వాడి: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీప్రియనగర్, కస్తూర్బాకాలనీల్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరాలపై దాడులు చేసి, పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. పేకాడుతున్న ఏడుగురి వద్ద నుంచి రూ.30,500, ఏడుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని తదుపరి చర్యల నిమిత్తం నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ రైల్వేస్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గురువారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 4570 నగదు, ఏడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి:నిజామాబాద్–జాన్కంపేట్ రైల్వేస్టేషన్ పరిధిలోని అర్సపల్లి గే ట్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందిన ట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టే షన్ మేనేజర్ హరికృష్ణ, ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా..అర్సపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి గు ర్తుతెలియని ప్రయాణికుడు జారిపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడికి సుమారు 25నుంచి 30ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గానీ, రైల్వే ఎస్సై నెంబర్ 8712658591కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ధర్పల్లి: మండలకేంద్రంలో గురువారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన అల్లెపు పెంటయ్య (55) కుమారుడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో పెంటయ్య మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని కుటుంబసభ్యులు గమనించి వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పెంటయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష

రుద్రూర్: రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రాణంపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిని గురువారం బోధన్ కోర్టులో హాజరు పరుచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా నవీపేట్ మండలం చాటాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు .

నిరుద్యోగుల పక్షాన పోరాడుతా!



మాట్లాడుతున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

నిజామాబాద్ సిటీ: విద్యార్థులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకనై వారి హక్కుల కోసం పోరాడుతానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తాను పాతిక సంవత్సరాలుగా పలు సేవాకార్యక్రమాలు చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుపేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. యువతకు కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. 14 నెలల కాంగ్రెస్ పాలన అయోమయంగా మారిందన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ మాటల గారడి చేస్తోందని మండిపడ్డారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్ విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



అసద్‌బాబానగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ గోడను తొలగిస్తున్న సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: నగరంలోని అసద్‌బాబానగర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రాంతంలో అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేయడానికి ఏర్పాటు చేసిన ప్రీ కాస్ట్ గోడను గురువారం అధికారులు తొలగించారు. భూమి కబ్జాపై ఈ నెల 1న సాక్షిలో 'రూ. కోట్ల విలువైన భూమి కబ్జా' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల అధికారులు స్పందించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సైతం సీరియస్‌గా స్పందించారు. గత నాలుగు రోజులుగా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేకంగా పరిశీలన చేపట్టి, ఫారెస్ట్ భూమి ఎంత మేరకు కబ్జా చేసి అక్రమంగా ప్రీకాస్ట్ గోడ వేశారో స్వయంగా వెళ్లి తెలుసుకున్నారు. సర్వే ల్యాండ్ అధికారి అశోక్ ఆధ్వర్యంలో రీ–సర్వే చేపట్టారు. నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ బాల్‌రాజు ఆధ్వర్యంలో గోడను తొలగించారు. భూకబ్జా వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు తెలియడంతో హైకమాండ్ సీరియస్ అయినట్లు సమాచారం.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



ప్రయోగ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షల కేంద్రాలను గురు వారం ఇంటర్ విద్యాశాఖ జిల్లా అధికారి రవికు మార్ తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని మరో 15 కేంద్రాలను తనిఖీ చేశా రు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో జియో ట్యాగింగ్ చేయాలని, కెమెరాలు పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ పాల్గొన్నారు.

నగరంలో భారీగా గంజాయి పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలో ఎండు గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సుమారు 2కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ద్వారకామాయి కాలనీ వద్ద ఎక్సైజ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో దాడులు చేయగా మహ్మద్ యూసుఫ్ అనే వ్యక్తి వద్ద 2.026 కిలోల గంజాయి, షేక్‌అలీం అనే వ్యక్తి వద్ద 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యూసుఫ్‌పై గతంలో గంజాయి కేసులు ఉండగా పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. నగరంలో ఒకే గ్యాంగ్ గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీస్ వర్గాలు గుర్తించినట్లు తెలుస్తోంది. వీరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదులు చేస్తే గంజాయి సరఫరా నిలిచిపోతుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

బిచ్కుంద మండలంలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి గ్రామం వద్ద గురువారం ఎండు గంజాయి పట్టుకున్నామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. దెగ్లూర్‌కు చెందిన అర్జున్ భగత్‌సింగ్ భండారి అనే వ్యక్తి నాందేడ్‌లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, వాటిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బిచ్కుంద, మద్నూర్, దెగ్లూర్ ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఆతడు గంజాయి అమ్మడానికి బిచ్కుంద వస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో కందర్‌పల్లి వద్ద ఎండు గంజాయితో పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. అతడి వద్దనుంచి 154 గ్రాముల ఎండు గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

ఖలీల్‌వాడి: ఒకరి మృతికి కారణమైన వ్యక్తి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం చిన్నరాంపూర్ గ్రామానికి చెందిన సమీవుద్దీన్, మహ్మద్ వాసిమోద్దీన్ అన్నదమ్ముల కొడుకులు. నిజామాబాద్‌లో పూలు విక్రయించే ముస్తఫాఖాన్ దగ్గర వాసిమోద్దీన్ పనిచేస్తుండగా అతడి వద్ద సుమారు రూ. 50వేలకు పైగా అప్పు చేశాడు. బాకీ తీర్చమని ముస్తఫాఖాన్ ఒత్తిడి చేయగా, వాసిమోద్దీన్ కుటుంబసభ్యుల పేరు మీద బ్యాంకులో సుమారు రూ.60వేలు లోన్ తీసుకున్నాడు. ముస్తఫాఖాన్‌కు డబ్బులు చెల్లించివస్తానని సమీవుద్దీన్ బైక్‌పై వెళ్లివచ్చాడు. కానీ రూ.45వేలు మాత్రమే చెల్లించాడని వాసిమోద్దీన్‌కు తెలియడంతో సమీవుద్దీన్‌తో గొడవపడ్డాడు. ఈక్రమంలో వాసిమోద్దీన్ కత్తితో సమీవుద్దీన్‌పై కత్తితో దాడిచేయగా తీవ్ర గాయాలతో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేయగా, కోర్టులో విచారణ జరిగింది. నిందితుడు వాసిమోద్దీన్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. అలాగే సాక్ష్యాధారాలు లేకుండా చేయడానికి యత్నించినందుకు మూడేళ్ల కఠిన శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి సునీత కుంచాల తీర్పు వెల్లడించారు.

బైక్ చోరీ నిందితుడి అరెస్ట్



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామంలో ఇటీవల బైక్‌ను చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. ఈ నెల 5న పడకల్‌లో మేకల సాయన్నకు చెందిన గ్లామర్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం మనోహరాబాద్ గ్రామ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతడు నిర్మల్ జిల్లా భాగ్యనగర్ గ్రామానికి చెందిన ముప్కాల రాకేష్‌రెడ్డిగా గుర్తించి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బోల్తా కొట్టిన కారు



నిజాంసాగర్ (జుక్కల్): మండలంలోని సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై గురువారం షిఫ్ట్ డిజైర్ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో క్రేన్ సాయంతో బయటకు తీశారు.

వడ్డేపల్లిలో ఒకరి ఆత్మహత్య

వర్ని: మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న పోశెట్టి (23)ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్సై రమేష్ గురువారం తెలిపా రు. పోశెట్టి భార్య మూడు సంవత్సరాల క్రితం అతడిని వదిలి వెళ్లడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ విషయంలో జీవితంపై విరక్తి చెంది ఎలకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.